క్లుప్తంగా

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి



పోనకలదిన్నెలో సచివాలయం స్లాబ్ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ జయన్న

నందవరం: ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ జయన్న ఏజెన్సీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన మంగళవారం పోనకలదిన్నె గ్రామంలో గ్రామ సచివాలయం స్లాబ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లు, పాలశీతలీకరణ కేంద్రాల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పనుల్లో పురోగతి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమణాలు పాటించడంతో పాటు త్వరగా పూర్తి చేసేలా ఏజెన్సీలకు సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవర

వెల్దుర్తి: మండల పరిధిలోని కృష్ణాపురం, బొమ్మిరెడ్డిపల్లె గ్రామస్తులు దేవరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కృష్ణాపురంలో సుంకులమ్మ, మారెమ్మ, కర్రెమ్మ, పెద్దమ్మ, గంగమ్మలకు, బొమ్మిరెడ్డిపల్లెలో మారెమ్మ అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవర సందర్భంగా విచ్చేసిన బంధుమిత్రులతో ఆయా గ్రామాలు కిక్కిరిశాయి. సీఐ యుగంధర్, వెల్దుర్తి, కృష్ణగిరి ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. కృష్ణాపురం దేవరలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్ రెడ్డి కుటుంబీకులు నలుగురు, మరో ఆరుగురు గ్రామస్తులు తేనెటీగల దాడిలో గాయపడ్డారు.

ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

తుగ్గలి: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు హాజరయే విద్యార్థులు బుధవారంలోపు ఫీజు చెల్లించాలని స్థానిక కేజీబీవీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సాలమ్మ సూచించారు. ఈనెల 24 నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఫెయిలైన విద్యార్థులు వెంటనే కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించాలని కోరారు.

7 వరకు వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: జిల్లాలో ఈ నెల 7వ తేదీ వరకు చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

యూనిఫాంలు వచ్చేశాయ్

మద్దికెర: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి స్కూల్ యూనిఫాంలు వచ్చాయని ఎంఈఓ రంగస్వామి మంగళవారం తెలిపారు. మండలంలో 3,670 మంది విద్యార్థులున్నారని, బడుల ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు.

ఉరుము శబ్దానికి ఎద్దు మృతి



తుగ్గలి: మండల పరిధిలోని నల్లగుండ్లలో ఉరుము శబ్దానికి ఓ ఎద్దు గుండె ఆగింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులుగౌడ్ తన రెండు ఎద్దులను వామిదొడ్డిలో కట్టేశాడు. సోమవారం రాత్రి మెరుపులతో పాటు భారీ శబ్దంతో ఉరుములు రావడంతో ఆ శబ్దానికి ఓ ఎద్దు మృత్యువాత పడింది. దాదాపు రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు

మద్దికెర: మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు రూ.25 లక్షలు మంజూరైనట్లు ఎంపీపీ అనిత, ఎంపీడీఓ నరసింహమూర్తి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఈ నిధులతో స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, హౌసింగ్, కస్తూరిబా విద్యాలయం, ఉపాధి కార్యాలయం, వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఒకే చోట ఉన్నాయని, అయితే కార్యాలయాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తే వెంటనే ప్రహరీ నిర్మిస్తామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర: వాతావరణంలో మార్పుల వల్ల వ్యాధుల బారిన పడే ప్రమాదముందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారులునగేష్ ,శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం వారు వైద్య మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. జ్వరాలు, దగ్గు విపరీతంగా వస్తున్నాయని రోజుల తరబడి తగ్గకపోతే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎండ వేడిమి అధికంగా ఉందని మధ్యాహ్నం వేళ వీలైనంత వరకు నీడలోనే ఉండాలన్నారు. ఉపాధి పనులు చేసే కూలీలు పని ముగిసిన తరువాత నీరసంగా ఉంటే ఓఆర్ఎస్‌ను సేవించాలన్నారు.

వేసవి సెలవులు.. బాలల వికాసానికి దారులు

- విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు
- ముందు తరగతుల్లో రాణించేలా శిక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



చిప్పగిరి, జెడ్పీహెచ్ హైస్కూల్

చిప్పగిరి: వేసవి సెలవులు వచ్చాయంటే విద్యార్థులకు పండగే. ఆటపాటలతో అల్లరిగా గడిపేస్తూ, వేసవి ఎండలో తిరుగుతూ పెద్దల సహనానికి పరీక్ష పెడుతుంటారు. ఈ పరిస్థితి నుంచి వారికి విముక్తి కల్పించి బాలల వికాసానికి కృషి చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ×వుయ్ లవ్ రీడింగ్‌ె ప్రోగ్రాం ద్వారా వేసవి సెలవుల్లో ఆన్‌లైన్‌లో పలు విద్యా సంబంధిత కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. పిల్లలపై ఇంతగా శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం ఇదేనని చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వేసవి సెలవులలో గ్రామీణ ప్రాంతాల పిల్లలు ఎక్కువగా ఈత సరదాకోసం చెరువులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీట మునిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు తల్లిదండ్రులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పడుతున్న బాధలు వర్ణణాతీతం. ప్రస్తుతం ప్రభుత్వం పిల్లలకు ఆన్‌లైన్ ద్వారా పలు విద్యా సంబంధిత కార్యక్రమాలు చేపట్టడంతో ఈ సమస్యకు కొంత మేర పరిష్కారం చూపినట్లయింది. వేసవి సెలవులు మే 1వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

బాలల వికాసానికి ఉపయోగపడేలా కార్యక్రమాలు

- ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోజువారీ కార్యక్రమాలపై నోట్‌బుక్ నిర్వహించి సెలవుల అనంతరం పుస్తకాన్ని సమర్పించేలా చర్యలు చేపట్టనున్నారు.
- వాట్సాప్ ద్వారా విద్యార్థుల కార్యకలాపాలను ఫొటోలు, వీడియోల రూపంలో నివేదిక రూపంలో సేకరించి పాఠశాల పునఃప్రారంభ వేడుకలో ప్రదర్శిస్తారు. ఈ మేరకు కార్యచరణ షెడ్యూల్‌ను రూపొందించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.
- విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశాలలో ఆన్‌లైన్ తరగతులు, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తారు. ఆన్‌లైన్ కార్యకలాపాలను వర్చువల్ ఈవెంట్ ద్వారా తోటి విద్యార్థులతో పంచుకునేలా చర్యలు చేపట్టనున్నారు.

ముందు తరగతుల్లో రాణించేందుకు అవకాశం



వేసవి సెలవు దినాలలో ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు పలు విద్యా సంబంధిత అంశాలపై ప్రత్యేక శిక్షణ ఉంటుంది. విద్యార్థుల అభిరుచి మేరకు కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో నైపుణ్యం మెరుగుపడుతుంది. చదువులో విరామం లేకుండా ముందు తరగతులలో రాణించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ఎంఈఓ మస్తాన్ రావు

జ్ఞానం పెరుగుతుంది



42 రోజుల పాటు వచ్చే వేసవి సెలవుల్లో చదువుకు విరామం రాకుండా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల వారిలో జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెరగడమే గాకుండా వివిధ అలవాట్లకు లోను కాకుండా క్రమశిక్షణ అలవడుతుంది. వేసవి సెలవు దినాలలో విద్యార్థులకు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– సింధు, విద్యార్థి తల్లి, నంచర్ల

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

మద్దికెర: సొంతిల్లు లేని వారందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేస్తుందని, ఇంటి పట్టాల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తహసీల్దార్ నాగరాజు సూచించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. మద్దికెరలో ఇప్పటికే ఒక చోట ఇంటి స్థలాలు ఇచ్చి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, మరింత మందికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొంతమంది దళారులు ఇంటి పట్టాలు మంజూరు చేయిస్తామని అమాయకులైన ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల పరిశీలనలో అర్హత ఉందని తెలిస్తే తప్పనిసరిగా ఇంటి పట్టాలు మంజూరు చేస్తారని వెల్లడించారు.

నేడు కనకవీడులో దేవర

నందవరం: మండల పరిధిలోని కనకవీడులో బుధవారం గ్రామ దేవత మారెమ్మవ్వ దేవర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయమే అమ్మవారికి జలాభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, ధూప దీప నైవేద్యాలతో పూజలు గావించారు. రాత్రి 11 గంటలకు బలిదానాలకు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచ్ మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ షేక్‌సాహెబ్, ఎంపీటీసీ సుశీలమ్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విజేత కానాల వృషభాలు



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: అమకతాడు గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ విభాగంలో నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా, సంజామల మండలం, కానాల గుండం చెన్నారెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో అనంతపురం జిల్లా, ఉబిచెర్ల పుల్లెం గోవిందు వృషభాలు, డోన్ మండలం, సీసంగుంతల మదన్‌మోహన్‌రెడ్డి వృషభాలు, బేతంచర్ల మండలం, హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా, మేడిమాగులపల్లె తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు నిలిచాయి. పోటీల్లో 8 జతల వృషభాలు పాల్గొనగా గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందజేశారు. ఉత్సవాల సందర్భంగా నాలుగు రోజుల పాటు ఆయల కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కోయిలకొండ జూనియర్ జట్టు విజేతగా నిలిచి రూ.20 వేలు కైవసం చేసుకోగా తర్వాతి స్థానాల్లో నిలిచిన అమకతాడు జట్టు, ప్యాపిలి మండలం బావిపల్లె జట్టు, వెల్దుర్తి మండలం సూదేపల్లె జట్టు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను దక్కించుకున్నాయి.

వెల్దుర్తి: ఎల్.నగరంలో వీరబ్రహ్మంగారి 42వ తిరునాల సందర్భంగా మంగళవారం పాల పండ్ల వృషభాల బండలాగుడు పోటీలను గ్రామ పెద్దలు నరేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. పోటీలో నంద్యాల జిల్లా, పాణ్యం మండలం కొత్తూరుకు చెందిన రెండు జతల బీరం బుల్స్ మొదటి, ద్వితీయ స్థానాలలో నిలిచి రూ.40 వేలు, రూ.30 వేలు గెలుచుకున్నాయి. తర్వాతి మూడు స్థానాల్లో వరుసగా ప్యాపిలి మండలం రంగారెడ్డి యాదవ్ వృషభాలు, అనంతపురం జిల్లా ఆదినారాయణ వృషభాలు, రుద్రవరం రాముడు వృషభాలు నిలిచి వరుసగా రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10 వేల నగదు గెలుచుకున్నాయి. అలాగే పరుగు పందెంలో తనకు తిరుగులేదనిపించేలా కొన్నేళ్లుగా విజేతగా నిలుస్తున్న సిద్దినగట్టు నవీన్ ఈసారి సైతం విజేతగా నిలిచి రూ.3 వేల నగదు గెలుచుకున్నాడు. తర్వాతి స్థానాలలో నంద్యాల కిశోర్, బుక్కాపురం అనిల్ నిలిచి రూ.2 వేలు, వెయ్యి గెలుచుకున్నారు.

సాంకేతిక విద్యతో ఉద్యోగావకాశాలు



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్

ఆలూరు: సాంకేతిక విద్యతో ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆలూరు జడ్పీటీసీ ఏరూరు శేఖర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఏడుగురు సివిల్, 15 మంది మెకానికల్ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు మంగళవారం ప్రిన్సిపాల్ చెన్నప్పరెడ్డి ఆధ్వర్యంలో ప్రాంగణ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. విద్యార్థులకు రాయల్ ఎన్‌ఫీల్డ్, అకాడమీ ఫర్ టెక్నికల్ స్కిల్, ఎస్‌ఏసీ ఇంజిన్ కాంపొనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమల్లో వార్షిక వేతనం రూ.2.2 లక్షలతో ఉద్యోగాలు లభించినట్లు వివరించారు. ఎంపీడీఓ అల్లాబకాష్, అధ్యాపకులు శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జడ్పీటీసీ ఏరూరు శేఖర్, ఎంపీడీఓ అల్లాబకాష్‌లను కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పూలమాలలతో సన్మానించారు.

మురి‘పింఛన్’



కడివెళ్లలో వృద్ధురాలు బోయ చెన్నమ్మకు పింఛన్ అందచేస్తున్న వలంటీర్ లక్ష్మణ్

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో రెండవ రోజు మంగళవారం పింఛన్ల పంపిణీ కొనసాగింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు చేరుకొని వేలిముద్రలు నమోదు చేసుకుని పింఛన్ సొమ్ము అందచేశారు. మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 8663 మంది లబ్ధిదారులకుగాను రూ.2,40,85,000 పంపిణి చేయనున్నట్లు ఎంపీడీఓ బంగారమ్మ తెలిపారు. ఇప్పటివరకు 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు చెప్పారు. వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గోనెగండ్ల: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన మునెప్ప కిడ్నీ సంబంధిత వ్యాధితో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతుండడంతో వలంటీర్‌లక్ష్మీదేవి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చింది.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంతో పాటు పేదల బతుకుల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వలక్ష్యమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం పెండ్లిమాన్‌తండా, గిడ్డమ్మ తండా గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేసి, గత నాలు గేళ్లలో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీపీ నారాయణ దాస్,పార్టీ మండల కన్వీనర్ నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఎంపీడీఓ పార్థసారధి, డీఎల్‌పీఓ శ్రీకాంత్ చౌదరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాల్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

వెల్దుర్తి: కృష్ణాపురం దేవరలో తేనెటీగల దాడిలో గాయపడి కర్నూలు విశ్వభారతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్ రెడ్డిని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. గోపాల్‌రెడ్డి భార్య రాములమ్మ, కుమారులు చెన్నారెడ్డి, శ్రీకాంత్ సైతం గాయపడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో అక్కడి వైద్యులను ఫోన్‌లో సంప్రదించి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని అభిలషించారు.

నివాళి

పత్తికొండ రూరల్: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి తల్లి నాగలక్షమ్మ మృతి చెందడంతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, బీజేపీ నాయకుడు రంగాగౌడ్ తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

దంచికొట్టిన వడగండ్ల వాన



పత్తికొండ కోయనగర్‌లో ఈదురుగాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

పత్తికొండ రూరల్: పత్తికొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో మంగళవారం వడగండ్ల వాన దంచికొట్టింది. సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో వర్షం మొదలై అరగంటపాటు కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పత్తికొండ–కర్నూలు రహదారిలోని వంకలో వర్షపు నీరు ప్రధాన రోడ్డుపైకి ఎక్కి పారడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. డ్రైనేజీలు వర్షపు నీటితో నిండి మురుగునీరు రోడ్డెక్కి పారింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో 3 గంటల పాటు సరఫరా నిలిపేశారు. భారీ వృక్షాలు నేలకొరిగాయి. గాలివాన బీభత్సంతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు పలువురు రైతులు పేర్కొన్నారు.

నందవరం: మండలంలో వర్షానికి వరి పైరు నేలకొరిగింది. నూర్పిళ్లు, కోతలు కోసిన వరి ధాన్యం, ఎండు మిరప వానకు నానడంతో రైతులు నష్టపోయారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

ఆలూరు: దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన సున్నపురాజు గ్రామంలో గుట్టుగా నాటుసారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భూపాలుడు మంగళవారం తెలిపారు. నిందితుడి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఏపీ 21 సీసీ 0990 నంబరు గల మోటారు సైకిల్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే మట్కాకు సంబంధించి రూ.1,450 నగదు స్వాధీనం చేసుకొని పత్తికొండ సివిల్ జూనియర్ జడ్జి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

యువగళం బృందం రౌడీయిజం

గోనెగండ్ల: మండలంలోని పుట్టపాశం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై యువగళం పాదయాత్ర బృందం, టీడీపీ నేతలు దాడికి దిగారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద నుంచి హెచ్.కైరవాడి, పుట్టపాశం , వేముగోడు గ్రామాల మీదుగా సాగింది. పుట్టపాశం గ్రామం ఎస్సీ కాలనీలో పాదయాత్ర సాగుతుండగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో లోకేష్ వెంట ఉన్న టీడీపీ నేతలు, యువగళం బృందం వారిపై దాడికి దిగారు. అక్కడే ఉన్న మహిళలు వారిని విడిపించారు. టీడీపీ నాయకులకు రౌడీయిజం చేయడం పరిపాటిగా మరిందని, గతంలో చంద్రబాబు కూడా దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని తమను అవమానించేలా మాట్లాడారని, ఆయన తనయుడు కూడా విదేశీ విద్య వల్ల దళితులు పీకిందేమీ లేదని వ్యాఖ్యానించారని గ్రామ దళితులు మండిపడ్డారు. దళితులను కించపరిచేలా మాట్లాడిన చంద్రబాబు, లోకేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని గ్రామ నాయకులు గంగాధర్, పెద్ద నాగన్న, మత్స్యవల్లబుడు తదితరులు డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం బొక్కేస్తున్నారు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

హొళగుంద: రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని ఆలూరు గోడౌన్ అధికారులు బొక్కేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఎండీయూ ట్రక్కు ఆపరేటర్ ఇలియాస్ మంగళవారం తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆలూరు ఎంఎల్‌సీ స్టాకు పాయింట్ నుంచి హొళగుంద డీలర్లకు పంపిణీ చేసిన బియ్యం బస్తాలను తహసీల్దారు కార్యాలయానికి తీసుకొచ్చి అధికారుల సమక్షంలో తూకం వేసి చూపించారు. హొళగుందలో 4, 19, 32 రేషన్ షాపులకు సంబంధించి 1,650 మంది కార్డుదారులకు 330 క్వింటాళ్ల (660 బస్తాలు) బియ్యంను ఎండీయూ ట్రక్కు ఆపరేటర్ ఇలియాస్ ప్రతి నెలా పంపిణీ చేయాల్సి ఉంది. మే నెలకు సంబంధించి 32వ రేషన్ షాపుకు వచ్చిన బియ్యం బస్తాలను మంగళవారం ప్రజలకు పంపిణీ చేసేందుకు తీసుకోగా కొన్ని బస్తాల్లో బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. బస్తాలను తూకం వేసి చూడగా 50 కేజీలకు గాను ఓ బస్తాలో 33.5 కేజీలు, మరో బస్తాలో 44 కేజీలు ఇలా తక్కువ తక్కువగా ఉండడంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లాతో కలిసి తహసీల్దారు వద్దకు తీసుకెళ్లి తూకాల్లో చేసిన మోసాలను వివరించారు. ఆలూరు గోడౌన్ నుంచి ప్రతి నెలా ఇలానే జరుగుతోందని, దీంతో పేదలకు బియ్యం పంపిణీ చేసే సమయంలో తక్కువ కావడం వల్ల రేషనుదారులు తమను నిందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని మండల కన్వీనర్ షఫివుల్లా ఫోన్‌లో మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌ను ఆదేశించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమస్య పరిష్కారం



కామినేహాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్

ఆలూరు రూరల్: హాలహర్వి మండలం కామినహాల్ గ్రామంలో రెండు రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి, రెండు బర్రెలు మృతిచెందిన ఘటనలతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విద్యుత్ అధికారులు అప్రమత్తమయ్యారు. డీఈఈ నాగేంద్ర ప్రసాద్, ఏఈ జమ్మన్న సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి నుంచి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఎర్తింగ్ సమస్యను మంగళవారం గుర్తించారు. గ్రామ సమీపంలోని పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేయించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు సరి చేశారు. మెయిన్ లైన్ వైర్ల మీద పడుతున్న చెట్టుకొమ్మలను తొలగించారు. ఏదైనా విద్యుత్ సమస్యలు ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు.

రెండు రోజుల్లో వ్యక్తి, రెండు బర్రెలు మృతి

కామినహాల్‌లో గత రెండు రోజుల్లో రెండు విద్యుత్ ప్రమాదాలు జరిగాయి.ఆదివారం ఉదయం చైతన్య (33) ఇంటి సర్వీస్ వైర్‌కు ఉన్న జీఐ వైర్ తొలగిస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని నీటి కుంట వద్ద ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ తగిలి రంగస్వామి, రంగ నాయకులు అనే రైతులకు చెందిన రెండు బర్రెలు మృత్యువాత పడ్డాయి. రెండు రోజుల క్రితం గాలివానకు గ్రామంలో ఎర్తింగ్ సమస్య ఏర్పడింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు ఆరోపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో నెలకొన్న సమస్య పరిష్కరించారు. చనిపోయిన రెండు బర్రెలకు పోస్టుమార్టం చేయించి ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎర్తింగ్ సమస్యను గుర్తించాం



రెండు రోజుల క్రితం గాలివానకు గ్రామంలో ఎర్తింగ్ సమస్య ఏర్పడింది. సోమవారం రాత్రి నుంచి ఇంటింటికీ తిరిగి ఎర్తింగ్ సమస్య గుర్తించాం. ఓ రేకుల షెడ్డుకు ఏర్పాటు చేసిన కరెంట్ వైర్ ఎర్తయ్యింది. గ్రామంలోని అన్ని విద్యుత్ స్తంబాలకు ఉన్న సర్వీస్ వైర్లను చెక్ చేయించాం. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశాం. గ్రామస్తుల వినతి మేరకు శిథిలావస్థలో ఉన్న 10 విద్యుత్ స్తంభాలను రెండు రోజుల్లో మారుస్తాం. వర్షాలు పడినప్పుడు విద్యుత్ వైర్లను ముట్టుకోవద్దు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సబ్ డివిజన్‌లోని అన్ని మండలాల విద్యుత్ అధికారులను హెచ్చరించాం.

– డీఈఈ నాగేంద్ర ప్రసాద్

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న గాలి పోతిరెడ్డి కుటుంబసభ్యులు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్యమైన మాతా మారెమ్మ ఆలయ నిర్మాణానికి రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలి పోతురెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.2 లక్షల నగదు అందజేశారు. అమ్మవారికి నూతనంగా ఆలయం నిర్మిస్తుండటంతో తమ వంతు సాయంగా అందజేసినట్లు దాత పోతిరెడ్డి తెలిపారు. ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతలచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.అమ్మవారి దేవాలయాన్ని రూ.3 కోట్లతో నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కాంతరెడ్డి తదితరులు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం

తుగ్గలి: విద్యుత్ ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ మహేశ్వరరెడ్డి సూచించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఇటీవల ఈదురు గాలులతో వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తెగిపోవడం, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. తడిచేత్తో విద్యుత్ పరికరాలు తాకరాదని, ట్రాన్స్ ఫార్మర్లు, మోటార్లు, ఫ్యూజుల్లో సమస్య తలెత్తితే సొంతంగా రిపేర్ చేసుకోవద్దని సూచించారు. విద్యుత్ సేవల్లో సమస్య తలెత్తితే వెంటనే సిబ్బందికి లేదా, అధికారులకు తెలియజేయాలని సూచిస్తూ వారి ఫోన్ నంబర్లు వెల్లడించారు.

తుగ్గలి సబ్ స్టేషన్–73826 05632,
పెండేకల్లు సబ్ స్టేషన్–73826 05633,
జొన్నగిరి సబ్‌స్టేషన్–73826 05634,
రామలింగాయపల్లి సబ్‌స్టేషన్–91549 53776,
మద్దికెర సబ్‌స్టేషన్–91549 53784

అలాగేవిద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్1912కు కాల్‌చేసి సమస్యను తెలియజేయాలని ఏఈ సూచించారు.